# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## రిజర్వేషన్ల పరిమితి సమస్య

**రిజర్వేషన్ల** పెంపుపై పాట్నా హైకోర్టు తీర్పుతో ఈ అంశం మరోసారి దేశంలో చర్చాంశమైంది. బీహార్‌లోని నితీశ్‌కుమార్ ప్రభుత్వం కులాల సర్వే ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతూ గతేడాది చట్ట సవరణ తెచ్చింది. రిజర్వేషన్ పరిధిలోని ప్రతి క్యాటగిరీకి తలా ఇంత పెంచడం వల్ల మొత్తం రిజర్వేషన్ల శాతం 65 శాతానికి చేరింది. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ పాట్నా హైకోర్టు ఈ పెంపును కొట్టివేసింది. చట్ట సవరణ ప్రవేశికలో పేర్కొన్న 'దామాషా సమానత్వం' అన్న అంశాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. 'తగినంత ప్రాతినిధ్యం' అంటే 'దామాషా ప్రాతినిధ్యం' కాదన్న పిటిషనర్ల వాదనతో కోర్టు ఏకీభవించింది. రాష్ట్ర జనాభాను బట్టి దామాషాగా రిజర్వేషన్లు ఇస్తూపోతే వాటి మొత్తం శాతం ఆమోదిత పరిమితిని దాటిపోతుంది. తద్వారా న్యాయవ్యవస్థ చేతిలో రద్దుకు గురయ్యే అవకాశం ఏర్పడుతుందనేది పాట్నా హైకోర్టు తీర్పు సారాంశంగా తీసుకోవచ్చు.

మన దేశంలో రిజర్వేషన్ల పరిమితిపై చాలాకాలంగా వివాదం నలుగుతూనే ఉన్నది. రాష్ట్రాలు తమ తమ ప్రత్యేక పరిస్థితులను బట్టి పరిమితికి మించి రిజర్వేషన్లు ఇచ్చేందుకు కృషి చేయడం కొత్తకాదు. ఆ ప్రత్యేక పరిస్థితులు ఏమిటన్న దాని మీద న్యాయ నిర్ణయం ఆధారపడుతున్నది. తెలంగాణలో ముస్లింలలో వెనుకబడిన వర్గాల కోసం 4 నుంచి 12 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్ 6 నుంచి 10 శాతానికి పెంచడం వల్ల రిజర్వేషన్ల మొత్తం శాతం 62కు పెరిగింది. కానీ ఈ పెరుగుదలకు సంబంధించిన చట్టసవరణ కేంద్రం దగ్గరే పెండింగ్‌లో ఉండిపోయింది. వెనుకబడిన రాష్ట్రమైన బీహార్‌లో ప్రత్యేక పరిస్థితులు అనే వాదాన్ని తిరస్కరించి, కోటా పరిమితి వైపే కోర్టు మొగ్గు చూపడంతో అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం సమకూర్చాలనే ప్రభుత్వ నిర్ణయానికి గండిపడింది.

చివరగా అందుబాటులోకి వచ్చిన గణాంకాల ప్రకారం మన దేశంలో దళిత బహుజన వర్గాలు 80 శాతం వరకు ఉంటాయి. రిజర్వేషన్లు మాత్రం 50 శాతం పరిమితికి లోబడి ఉండాలని 1992లో వెలువడిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తెలియజేస్తున్నాయి. సమానావకాశాల సూత్రాన్ని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసినప్పటికీ 50 శాతం పరిమితికి ఎలా వచ్చారన్నది తెలియడం లేదు. కేంద్ర, లేదా రాష్ట్రాల శాసన సభలు ఈ విషయమై ఎలాంటి తీర్మానాలు చేసిన దాఖలాలు లేవు. వెనుకబడినవర్గాల ఉద్యమకారులు మొదటినుంచీ ఈ పరిమితిని వ్యతిరేకిస్తున్నారు. వెనుకబడిన వర్గాల రాజకీయ సంస్కృతి ప్రబలంగా ఉన్న తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లతో పరిమితికి సవాలు విసిరింది. కేంద్రం కూడా 2019లో అగ్రవర్ణాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం 10 శాతం కోటాతో పరిమితి దాటేసింది. దీనిపై దాఖలైన పిటిషన్లను న్యాయస్థానాలు విచారణకు స్వీకరించినప్పటికీ కోటాపై స్టే ఇవ్వలేదు. కానీ కొన్ని ఇతర రాష్ట్రాల విషయంలో పరిమితి పేరు చెప్పి అదనపు రిజర్వేషన్లను కోర్టు కొట్టేసింది. ఈ 50 శాతం కోటా పరిమితిపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. అంతిమంగా శాసనపరమైన నిర్ణయం జరిగితే పరిమితి అడ్డంకి తొలగిపోయి సామాజిక న్యాయానికి దారి సుగమం అవుతుంది.

# హాల్ ఆఫ్ షేమ్!



టంకశాల అశోక్

**తెలంగాణలో ఎప్పటికైనా హాల్ ఆఫ్ ఫేమ్, హాల్ ఆఫ్ షేమ్ పేరిట రెండు హాళ్లు నిర్మించినట్టయితే ఎందులో ఎవరి చిత్రపటాలను ఉంచాలి? నాకు తోచినంత వరకు హాల్ ఆఫ్ ఫేమ్‌లో కాళోజీ, జయశంకర్, విద్యాసాగర్ రావు వంటి వారు ఉండాలి. హాల్ ఆఫ్ షేమ్‌లో కె.కేశవరావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి వంటి వారుండాలి. పార్టీలలోకి అనేకులు వస్తుంటారు, పోతుంటారు. అది ఇప్పుడు ఒక విశేషం కానే కాదు. కనుక వారి గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానించాల్సిందేమీ లేదు.**


**కానీ, కొందరు వ్యక్తులు తమ దశాబ్దాల ప్రజా జీవితంలో, రాజకీయాలకు మించిన వ్యక్తిగత గౌరవాన్ని, విశ్వాసాన్ని సంపాదించుకుంటారు. ఇతరులు పార్టీలు మారినప్పుడు ఒక్క మాటతో తీసివేసే ప్రజలు, వీరి విషయంలో అట్లా చేయలేరు. ఇది వర్తమానం. భవిష్యత్తుకు సంబంధించి వీరి నైతిక వారసత్వం ఏ విధంగా మిగులుతుంది? చరిత్ర వారిపై ఏ తీర్పు చెప్పి ఏ విధంగా గుర్తుంచుకుంటుంది? చరిత్ర ఎప్పుడూ కర్కశమైనది. అది వారిని చిత్రపటాలుగా మార్చి హాల్ ఆఫ్ షేమ్‌లో వేలాడదీస్తుంది.**

సాధారణ స్థాయి నాయకులు, సాధారణమైన ధోరణులతో ఉండేవారు పార్టీలు మారటం ఆ స్థాయికి, ధోరణికి అనుగుణంగా జరిగేది. వారికి రాజకీయాల్లోకి రావటం నుంచి మొదలుకొని జీవించినంతకాలం అదొక వ్యాపారం మాత్రమే. అధికార వ్యాపారం, ధన వ్యాపారం. వారెవరో, ఇవాళ ఎక్కడ ఉంటున్నారో, రేపు ఎటు పోతున్నారో, ఏమి చెప్పి ఆ పని చేస్తున్నారో ఎవరికీ గుర్తు కూడా ఉండదు. అటువంటివారికి కనీసం హాల్ ఆఫ్ షేమ్‌లో చేరే అర్హత అయినా ఉండదు. కొందరు అట్లా కాదు. వారు మొదటి నుంచి బాగానే ఉంటారు. జీవిత చరమాంకంలో అకస్మాత్తుగా, హాల్ ఆఫ్ షేమ్‌కు అర్హత సంపాదించుకుంటారు. అటువంటివారి గురించి మాత్రం తదనంతర తరాలు చరిత్రలోని పతన వ్యక్తిత్వాలుగా రేఖామాత్రంగానైనా తెలుసుకోవాలి. అది, చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవడానికి అవసరం. అందుకే ఇక్కడ రాయటం.

బీఆర్ఎస్ అనేది ఒక పార్టీ. కేసీఆర్ అనే వ్యక్తి దాని నాయకుడు. పదేండ్ల పాటు కొన్ని విధానాల ప్రకారం ఆయన పరిపాలించారు. విధానాలలో మంచిచెడులు రెండూ ఉండవచ్చు. పరిపాలనలో తప్పొప్పులు రెండూ ఉండవచ్చు. వ్యక్తిగతంగా నాయకత్వపు తీరులోనూ బాగున్నవి, లేనివి రెండూ ఉండవచ్చు. వీటన్నింటిని కలిపినది ఒక స్థితి. మొత్తం వీటన్నింటిపై చూసినప్పుడు ప్రజల్లో కొన్నింటి గురించి ప్రశంసలు, కొన్నింటి గురించి విమర్శలు ఉన్నాయి. ఉద్యమకాలంలో 2014 వరకు ఒక విధంగా అయితే, ఆ తర్వాత రాజకీయ నాయకుడు కావటంతో పాటు పాలకుడు కూడా గనుక మరొక విధంగా.

**ఇది ప్రజల దృష్టి నుంచి గల పరిస్థితి. ఇది గాక ఉద్యమకారులు, మేధావులు, మీడియా అన్నది రెండవ స్థితి. ప్రతిపక్షాలన్నది మూడవ స్థితి. స్వయంగా అధికార పక్షమైన బీఆర్ఎస్‌కు చెందినవారిది నాలుగవ స్థితి. ఇందులో మొదటి మూడింటి గురించిన చర్చ ఇక్కడ అవసరం లేనిది. హాల్ ఆఫ్ ఫేమ్, హాల్ ఆఫ్ షేమ్ ప్రస్తావనలు నాలుగవ సందర్భానికి సంబంధించినవి గనుక అందుకు పరిమితమవుదాం.**

పై ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నంతకాలం ఏమి జరిగిందన్నది ఒక విషయం. పార్టీ నుంచి వెళ్లిపోయింది ఏ దశలో, ఏ కారణాలు చెప్పి అనేది రెండవ విషయం. పార్టీలో, పదవులలో కొనసాగుతున్నప్పటికీ వారికి పైన పేర్కొన్న వేర్వేరు అంశాలపై నాయకత్వం కన్నా భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అందులో ఆక్షేపించవలసింది గాని, అప్రజాస్వామికం గాని ఏమీ లేదు. ఒక పరిమితికి మించితే తప్ప పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమైనది కూడా ఏమీ ఉండదు. ఈ ముగ్గురి విషయంలో ఏమి జరిగింది? అట్లా భిన్నాభిప్రాయాలు ఏవైనా ఉండేవా? ఎంత జాగ్రత్తగా గుర్తు చేసుకున్నా అటువంటివేమీ కనిపించవు. కనీసం పార్టీతో, నాయకత్వంతో సంబంధాలు తెంచుకోవలసిన స్థాయివి. పైగా ముగ్గురికి ముగ్గురూ నాయకత్వాన్ని, ప్రభుత్వ పాలనను వేనోళ్ల పొగిడినవారే. పూర్తిగా చివరి దశ వరకు. అంతదాకా ఎన్నెన్నో పదవులు, గౌరవాలు



పొందినవారే. సరే. ఈ మాటలు అందరూ అంటున్నవే. కొత్త లేదు. కాని వారికి అటువంటి విమర్శలు ఏమైనా ఉంటే, పార్టీలో ఉండినప్పుడు సాహసించ లేదనుకుంటే, కనీసం బయటికి వచ్చిన తర్వాతనైనా ప్రజలకు తెలియజెప్పాలి కదా. శ్రీనివాసరెడ్డి అంటే మొన్నమొన్న బయటకు వచ్చారు. తక్కిన ఇద్దరికి కొన్ని నెలలైంది కదా. అంతకన్న విశేషమేమంటే వారు ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని బయటికి వచ్చి కూడా కొద్ది సందర్భాలలో మెచ్చుకున్నట్టు ఉన్నారు. అది మొహమాటానికా? కాని పార్టీలోంచి బయటకు రావటాన్ని, అది కూడా అంత అకస్మాత్తుగా, అందులోనూ పార్టీ ఎన్నికలలో ఓడినప్పుడు జరగటాన్ని ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలి? బీఆర్ఎస్ గురించి, కేసీఆర్ గురించి కొత్తగా అనుకోవలసిందేమీ లేదు. పైగా తాము కొత్తగా ఏమీ చెప్పనప్పుడు. కాని తమను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? తమ చర్యను ఏమని ఆమోదించాలి?

సీనియర్లు అయినా, దశాబ్దాల జీవితంలో ఇతరుల కన్న భిన్నంగా గౌరవపాత్రులైనా, వారికి సైతం ఒక నిజ జీవితం, కోరికలు, సంతానం భవిష్యత్తు పట్ల ప్రీతి ఉంటాయన్నది నిజం. అట్లా ఉండకూడదనటానికి వారు సర్వ సంగపరిత్యాగులేమీ కారు. అంతవరకు సరే. కాని అదే సమయంలో, ఇతరుల కంటే భిన్నంగా వీరొక ప్రతిష్ఠ కూడా సంపాదించుకున్నారు. ఆ క్రమంలో అనేకం అనుభవించారు కూడా. అటువంటప్పుడు తమ కోసం, తమ సంతానం కోసం అవసరమనుకున్నవి చేస్తూనే కొంత నైతికత, విలువలు అనేవి కూడా పాటించాలి. కానప్పుడు తమ ఇంతకాలపు ప్రతిష్ఠకు మిగిలే అర్థం, విలువ ఏమిటి?

ఈ చర్చ వచ్చినప్పుడే ఆ ముగ్గురు ఆ పని సరిగ్గా ఎటువంటి దశలో చేశారు, ఏమి చెప్తూ చేశారనే ప్రశ్నలు వస్తాయి. ఇవి రెండూ తెలంగాణ అంతా చూసినవే గనుక ఇప్పుడు మళ్లీ చెప్పుకోనక్కరలేదు. అయితే ఈ దశలో మౌలికమైన విషయాలు కొన్ని ముందుకు వస్తాయి. తెలంగాణకు మొత్తం దేశంలోని ఉద్యమ భూములలో ఒకటిగా పేరున్నది. దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా. ఎందరెందరో తమ పోరాట వారసత్వాలను, స్ఫూర్తులను చరిత్రలో నమోదు చేసుకొని, తర్వాతి తరాలకు మిగిల్చిపోయారు. ఇటీవలి దశాబ్దాల కాలానికి వస్తే, ఆ పోరాటాలన్నవి స్వాతంత్ర్యానంతర ఆధునిక ప్రజాస్వామ్య దశలో ఉద్యమాలుగా రూపాంతరం చెందాయి. వివిధ ప్రాంతాలు, వర్గాల రాజ్యాంగ హక్కులు, ఇతర హక్కుల ఉద్యమాలుగా.

**తెలంగాణ అటువంటి ఉద్యమమే ఒకటి మహత్తరమైన రీతిలో సాగించి విజయం సాధించింది. ఆ ఉద్యమం, ఆ విజయం, అందులో పాల్గొన్న వ్యక్తులు తదనంతర తరాలకు ఒక గొప్ప చరిత్రను, స్ఫూర్తిని, విలువలను, నైతికతలను మిగిల్చారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమం గురించి కూడా మనం ఈ విధంగానే మాట్లాడుకుంటాం. ఆ స్థాయితో మనను పోల్చుకోవడం కాదు గాని, రెండిటి మధ్య సామ్యాలు చెప్పుకోవటం వరకు సరైనదే.**

ఆ విధంగా చూసినప్పుడు, ఈ ముగ్గురి వంటి నాయకులు తమ తర్వాతి తరాలకు, భవిష్యత్తుకు, తెలంగాణ చరిత్రకు మిగిలించవలసింది ఏమిటి? తమ సుదీర్ఘ రాజకీయ భాగస్వామ్యాన్ని, ప్రజా జీవితాన్ని, ఉద్యమ చరిత్రను తెలంగాణ ఏ విధంగా గుర్తుంచుకోవాలి? తాము ఎటువంటి సందేశాన్ని వారసత్వంగా తమ జీవిత చరమాంకంలో ప్రజలకు ఇవ్వాలి? ఏ స్థానం సంపాదించుకోవాలి? చివరికి ఒక ఘడియ ప్రాయమైన మోహావేశంతో, అకస్మాత్తు అనిపించేటట్టు చేసిందేమిటి? హాల్ ఆఫ్ షేమ్‌లో చోటు సంపాదించుకోవటం!

**సీనియర్లు అయినా, దశాబ్దాల జీవితంలో ఇతరుల కన్న భిన్నంగా గౌరవపాత్రులైనా, వారికి సైతం ఒక నిజ జీవితం, కోరికలు, సంతానం భవిష్యత్తు పట్ల ప్రీతి ఉంటాయన్నది నిజం. అట్లా ఉండకూడదనటానికి వారు సర్వ సంగపరిత్యాగులేమీ కారు. అంతవరకు సరే. కాని అదే సమయంలో, ఇతరుల కంటే భిన్నంగా వీరొక ప్రతిష్ఠ కూడా సంపాదించుకున్నారు. ఆ క్రమంలో అనేకం అనుభవించారు కూడా. అటువంటప్పుడు తమ కోసం, తమ సంతానం కోసం అవసరమనుకున్నవి చేస్తూనే కొంత నైతికత, విలువలు అనేవి కూడా పాటించాలి. కానప్పుడు తమ ఇంతకాలపు ప్రతిష్ఠకు మిగిలే అర్థం, విలువ ఏమిటి?**

'మహారాజా..! కూటకార్యం మహా గుప్తం. నూరు మాయోపు వేషాలతోనైనా జనుల దృష్టి మరల్చాలె. శత్రువు లోభి అయితే ఆశ చూపి వశపరుచుకోవాలె. సమబలుడైతే నిందలు వేసి, మోసం చేసి కడతేర్చాలి' అని మహాభారతం ఆదిపర్వంలోని ఉప పర్వమైన సంభవ పర్వ ముగింపులో ధృతరాష్ట్రునికి బోధిస్తడు కణికుడు. ఇదే కణిక నీతి. కణికుని నీతికి అప్‌డేటెడ్ వెర్షనే నిన్నటి మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీ ఫిరాయింపు. మొన్నటి విద్యుత్తు కొనుగోళ్ల మీది విచారణ కమిషన్. మాయపుటెత్తుతో జాతీయ యవనికలో కేసీఆర్ కీర్తికి మసిపూసే కపట నాటకానికి విచారణ కమిషన్ తెరలేపితే.. ఆయన్ను అస్థిరపరిచి కార్యభంగం లేకుండా బొగ్గుట్టను ఎత్తుకుపోయే కలి పురుష వ్యూహమే పోచారం కప్పగెంతులు.

# కణికుని నీతికి అప్‌డేటెడ్ వెర్షన్



వర్ధెల్లి వెంకటేశ్వర్లు



తెలంగాణకు ఆపద వస్తే.. ఎన్నిసార్లయినా చావు నోట్లె తలపెట్టి ఆపగలిగే గండర గండడు కేసీఆర్. గద్ద దొంగ దెబ్బ నుంచి పిల్లలను కాయగల్గేది తల్లికోడి రెక్క బల్కరమే గానీ.. తువ్వాలు, తుప్పల చాటు లెప్పుటికీ దాపు కాదు. తెలంగాణ జోలికొస్తే కేసీఆర్ తల్లి కోడై కాదు, బెబ్బులి పులై లేస్తడు. అందుకే బలవంతుడైన యోధుడిని ఎదుర్కోవటం కంటే ప్రజల్లో పలుచన చేసి, అతని శక్తి యుక్తులను నిర్వీర్యం చేసే కూటపుటెత్తే కణిక నీతి. ఈ మాయోపవేశం నుంచి పుట్టినవే కప్పదాట్లు, విచారణ కమిషన్లు.

తెలంగాణనే బలిపీఠం చేసి.. మన బిడ్డల చేతికే కత్తి ఇచ్చి.. సింగరేణిని బలిచ్చే తంతుకు అంకురార్పణ జరిగింది. వందేండ్ల సంస్థ భవిష్యత్తును చీకట్లోకి నెట్టి.. వేల మంది కార్మికుల పొట్టగొట్టే దుష్ట క్రతువుకు అటు కేంద్ర బొగ్గు మంత్రిగా మన బిడ్డే.. ఇటు డిప్యూటీ సీఎంగా మన బిడ్డే దగ్గరుండి రతి (క్షుద్ర ముగ్గు) పోశారు. తెలంగాణ సమాజానికి కోటి కాంతులిచ్చే నల్ల బంగారు సిరుల గనికి ఎగబడి మరణశాసనం రాస్తుంటే.. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా సింగరేణి జనులు ఆందోళనలు, నిరసనలు చేయాల్సిన సమయం. కానీ, పాలకులు తెలివిగా దృష్టి బంధనం చేశారు. కేంద్రం మౌఖిక ఆదేశమే అందిందో.. రాజ్య పన్నాగంలో భాగమో ఏమో! కానీ, స్వయంగా ముఖ్యమంత్రే సీన్‌లోకి వచ్చి రాష్ట్ర ప్రజల దృష్టి పోచారం శ్రీనివాసరెడ్డి ఇంటి మీదికి మళ్లించారు. అక్కడ మహాద్భుతమేదో జరుగబోతున్నట్టు సీన్ క్రియేట్ చేశారు. 'జన్మలో మిమ్మల్ని మరువం సార్.. ప్రాణం ఉన్నంత వరకు మీరే మా నాయకుడు సార్.. ఇంకొకరు లేరు' అని గుండె మీద ఒట్టేసి చెప్పిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి.. ఎద మీద తన్ని కాంగ్రెస్ గోడ దూకిన తీరుపై మీడియా ఫోకస్ పెట్టిన వేళ.. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి అప్రతిహతంగా సింగరేణి గనులను వేలం వేసే క్రతువును పూర్తి చేశారు.

స్వరాష్ట్రం సిద్ధించేనాటికి తెలంగాణ రైతు ఆత్మహత్యల మాగాణి. బోరుబాయిల కింది వ్యవసాయం. కరెంటు ఉంటేనే పంట. లేకుంటే తంటా. సాగు చేయకపోతే మానం పోతది.. సాగు చేస్తే పాణం పోతది అన్నట్టు ఉండేది రైతు పరిస్థితి. 2014లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం... తెలంగాణలో 898 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అంతకుముందు ఏడాది అంటే 2013లో 822 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దేశంలోనే మనది రెండో స్థానం. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 53.1 శాతం మంది చిన్నకారు, 14.5 శాతం మంది సన్నకారు రైతులే. ఇందులో 66 శాతం మంది కుటుంబ భారాన్ని మోసే 30-60 ఏండ్లవారే. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో 'మా వనరులు మాగ్గావాలె' అని కొట్లాడి తెలంగాణ తెచ్చిన సారే కొలువు కూటాల మీది కి వచ్చిండు. సాగు మీద, రైతుల సావుల మీద ఆలోచన చేసిండు. ఎక్కడ కరెంటు దొరుకుతుందో అన్వేషణ చేసిండు. రైతుల మోముల్లో వెలుగులు నింపిండు.

ఒక్క వ్యవసాయమే కాదు, నిన్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్ వార్డుల్లో కరెంటు పోయినట్టే నాడు రాష్ట్రమంతటా కరెంటు కోతలుండేవి. కాన్పు చేస్తున్నప్పుడు, ఆపరేషన్లు చేస్తున్నప్పుడు కరెంటు పోయి అవస్థలు పడటం ప్రతి తెలంగాణ పౌరునికి అనుభవమే. పరిశ్రమల్లో పవర్ హాలీడే అని.. ఐటీ సెక్టార్‌లో పవర్ కట్ అని.. సింగిల్ ఫేజ్, డబుల్ ఫేజ్, త్రిబుల్ ఫేజ్ అని కరెంటులో ఎంత దరిద్రం ఉన్నదో అంత అనుభవించినం. అటువంటి గుడ్డికాలం నుంచి వార్ మోడ్‌లో తెలంగాణకు వెలుగుదారి చూపిన దార్శనికుడు కేసీఆర్. ఛత్తీస్‌గఢ్ కరెంటు యూనిట్‌కు రూ.3.90 లెక్కన ఒప్పందం చేసుకుంటే.. ట్రాన్స్‌మిషన్ లైన్‌ఛార్జీలు కలిపి యూనిట్‌కు రూ.5.64 దాకా ఖర్చయ్యిందట. ఇది అవినీతి అని విచారణ పూర్తి కాకముందే కమిషన్ తీర్పు లీకులు ఇస్తున్నది. 'కొన్న కరెంటును చేత పట్టుకరాకుండా కరెంటు తీగల మీద ఎందుకు తెచ్చింద్రు' అన్నట్టుగా సాగుతున్నదీ విచారణ తీరు.

ఇదే కాలంలో పక్క రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు యూనిట్‌కు రూ 6.75 చొప్పున కొనుగోలు చేసినట్టు నివేదికలు చెప్తున్నాయి.

**2023 ఆగస్టు నుంచి నవంబర్ వరకు ప్రపంచవ్యాప్తంగా బొగ్గు నిల్వలు పడిపోయినప్పుడు.. విద్యుత్తు ఉత్పత్తి స్తంభించింది. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు యూనిట్‌కు రూ.10 ధర కట్టిస్తమని డబ్బులు పట్టుకొని తిరిగింద్రు. దొరికిన దగ్గర కొన్నరు. రూ.3కే దొరికే కరెంటును రూ.10కు కొన్నరు కాబట్టి రూ.7 అవినీతి జరిగిందంటే సమ్మతమేనా?**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం 2022లో అత్యధికంగా 4,248 మంది రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలతో మహారాష్ట్ర ముందు వరుసలోనే ఉండగా.. తెలంగాణ అతి తక్కువ రైతు ఆత్మహత్యలతో చిట్టచివరన నిలిచింది. అప్పులు తీరడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నరు. వ్యవసాయిక విప్లవంతో ఏడాదికి సగటున 650 నుంచి 700 మంది రైతు ఆత్మహత్యలు కేసీఆర్ ఆపగలిగారు. కనిష్టంగా ఎనిమిదేండ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే 5400 మంది రైతుల ప్రాణాలు దక్కినయి. యూనిట్ ధర మీద లాభనష్టాల లెక్కలు కడుతున్న విచారణ కమిషన్.. రైతు ప్రాణం ఖరీదుకు లెక్కలు వేయాలి కదా? ఒక్క రైతు ప్రాణం ఖరీదు ఎన్ని యూనిట్ల ధరకు సరిసమానమో తేల్చి చెప్పాలి కదా!

లెక్కకు మిక్కిలి ఐటీ కంపెనీలు వచ్చాయి. లక్షల్లో ఉద్యోగ కల్పన జరిగింది. 2014లో రూ.66,276 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు కేసీఆర్ దిగిపోయే నాటికి రూ.2,41,275 కోట్లకు ఎగబాకింది. నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగినయి. పల్లెల్లో జీవనం కోల్పోయిన జనం పట్నం వచ్చి బతుకు దారి వెతుక్కున్నరు. ఫలితంగా ఆకలిచావులు ఆగినయి. ఇప్పు డు చెప్పాలి.. పారగాన్ చెప్పుల పోరల షూటుబూటు జీవన నాణ్యతను ఏ కొలమానంతో కొలుస్తారో! పెరిగిన జనజీవన ప్రమాణం ఎన్ని యూనిట్ల విద్యుత్తు ధరకు సరిసమానమో! అంచనా గట్టాలి. ప్రతి రంగంలో సాధించిన ప్రగతిని మదించి కేసీఆర్ ప్రభు త్వం కొనుగోలు చేసిన ప్రతి యూనిట్ ధరతో సరిపోల్చి లాభనష్టాలను బేరీజు వేయాలె. అప్పుడే విచారణకు అర్థం ఉంటుంది.

హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ఉగ్గడించే కపటం తెరచాటున జరుగుతున్నది. క్రతుభంగం లేకుండా కార్యసిద్ధి జరగాలంటే కేసీఆర్‌ను దాటిరావాలి. కానీ అది అసాధ్యం. అందుకే కణిక నీతి సాగుతున్నది. అతని మీద అవినీతి ముద్రవేసి జాతీయస్థాయిలో ఆయన కీర్తికి మసిపూసి అచేతనున్ని చేసే కుట్ర జరుగుతున్నది.


ఈ తెలంగాణ కోటి గాయాల వీణ. వేన వేల వంచనల నేల. ఈ ఏడెనిమిదేండ్లు మినహా కాలచక్రం ప్రతి మలుపులోనూ త్యాగాల చాళ్లు.. నెత్తుటి ఆనవాళ్లున్నయి. అయినా ఎప్పుడూ ఆకురాలే కాలమే ఉండదు. దాని తర్వాత శివ సత్తులు బోనమెత్తే కాలమొస్తది.. బతుకమ్మలు రూపం కట్టి పాటలై రాగమందుకునే కాలమొస్తది. ఆ పాటకు జమ్మి చెట్టు మీది మూట ఆయుధమై దిగుతది. అప్పుడు 'చలో ధూమ్ ధామ్ తెలంగాణ జాతరొచ్చెరా'.. అని జనం కవాతు తొక్కే అస్సలు తెలంగాణ ప్రళయ గర్జనొస్తది జాగ్రత్త.

# మేధావులు మేలుకోండి!



మేడిపల్లి వెంకటేశ్వర్ రెడ్డి
96151 46666

**'సిరా చుక్క మౌనం వహిస్తే
సారా చుక్క రాజ్యమేలుతుంది
మేధావులు మౌనం వహిస్తే
మూర్ఖులు రాజ్యమేలుతారు'**



తెలంగాణ గడ్డ పోరాటాల అడ్డా. ఇక్కడి మట్టికి, గాలికి, నీటికి కూడా అన్యాయాన్ని ప్రశ్నించే తత్వం ఉంటుంది. దుర్మార్గంపై తిరుగుబాటు చేసే స్వభావం ఉంటుంది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దాకా, సిరిసిల్ల, జగిత్యాల ప్రజా ఉద్యమాల నుంచి మలిదశ ప్రత్యేక రాష్ట్ర సాధన దాకా ఇలా ఎన్నెన్నో పోరాటాలను నడిపిన చరిత్ర ఈ గడ్డకు ఉన్నది.

స్వరాష్ట్రం ఏర్పడ్డాక ప్రొఫెసర్ కోదండరాం లాంటి కొందరు కుహనా మేధావులు తమ స్వీయ అభివృద్ధి, స్వప్రయోజనాల కోసం కేసీఆర్ నాయకత్వంలో గత ప్రభుత్వం సాధించిన విజయాలు, పునర్నిర్మాణంపై విషం చిమ్మారు. నిశీధిలో ఉషోదయపు వెలుగులను, 2 కోట్ల ఎకరాల తెలంగాణ ఎవుసాన్ని, చివరి ఆయకట్టుకు నీరందించిన నీటి వనరులను, కొండకోనలకు చేరిన భగీరథ నీళ్లను, పారిశ్రామిక ప్రగతిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేశారు. అంతేకాదు, 'కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తాం, విధ్వంసం సృష్టిస్తాం' అంటున్న పదవి కాంక్ష తప్ప తెలంగాణ ప్రయోజనాలే పట్టని పాలకులతోనూ చేతులు కలిపారు. స్వప్రయోజనాల కోసం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్న ఇలాంటి వారి గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

దుర్మార్గుల దౌర్జన్యం కంటే మేధావుల మౌనం వల్లనే సమాజానికి ఎక్కువ నష్టం జరుగుతుంది. మేధావుల ముసుగులో కొందరు గత ప్రభుత్వంపై అసత్యాలను, అర్ధ సత్యాలను ప్రచారం చేసి ప్రజల మనసులను కలుషితం చేశారు. తత్ఫలితంగానే రాష్ట్రంలో ఇప్పుడు విధ్వంస పాలన సాగుతున్నది. ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు దాటినా ఏ ఒక్క హామీ నెరవేరలేదు. పైగా రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయి. ఒక్క కొత్త పథకాన్ని కూడా అమలుచేయని కాంగ్రెస్ పాలకులు తమ విలాసాల కోసం రూ.30 వేల కోట్లకు పైగా అప్పు చేశారు.

తప్పులను ప్రశ్నించాల్సిన కొందరు మీడియా ప్రతినిధులు పాలకులతో కుమ్మక్కై అవాస్తవాలను, అర్ధ సత్యాలను వల్లె వేస్తున్నారు. తెలంగాణపై వారికున్న కక్షకు వారు రాస్తున్న కథనాలే నిదర్శనం. సిరా చుక్క విలువలకు తిలోదకాలిచ్చిన అలాంటివారిని ఉద్యమ స్ఫూర్తితో ఉతికి ఆరవేయాలి. ఈ కుహనా పత్రికలు, నాయకులను ప్రశ్నించి, తెలంగాణ విధ్వంసాన్ని ఆపాల్సింది మేధావులే. లేదంటే తెలంగాణలో మరోసారి చీకట్లు అలుముకోవడం ఖాయం. పాలన గాడి తప్పినప్పుడు నిస్సంకోచంగా వేలెత్తి చూపించాల్సిన బాధ్యత మేధావి వర్గానిదే. ఉదాసీనతతోనో, పదవుల ఆశతోనో మేధావులు మౌనం వహిస్తే తెలంగాణ సమాజం వారిని క్షమించదు.

**'మార్గం తెలిసిన వాడు మేధావి
చూపించినవాడు నాయకుడు
దాటినవాడు సమర్థుడు
కానీ, మార్గం తెలిసి చూపించక
దాటనివాడు అసమర్థుడు'**

పాలకులు చేసే తప్పులను ప్రశ్నించే దాశరథి, కాళోజీ, జయశంకర్ సార్ తదితరుల వారసులు తెలంగాణలో లేరా? మేధావులారా ఇప్పటికైనా మేల్కొనండి. ప్రాణాలకు తెగించి సాధించుకొని, పునర్నిర్మాణం చేసుకున్న తెలంగాణను మళ్లీ చీకటిపాలు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయి. పదవుల కోసం పాకులాడుతూ మీ ధర్మాన్ని విస్మరించకండి. ఇప్పటికైనా తెలంగాణ మట్టికి, గాలికి నీటికి ఉన్న ప్రత్యేకతను కాపాడండి. పోరాటాల వారసత్వాన్ని కొనసాగించండి.

**జై తెలంగాణ!**

